రైతులంటే ఎందుకంత చిన్నచూపు ?

- మామిడి ధర ఇవ్వలేక చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- మాజీ సీఎం జగన్ పర్యటన విజయవంతం కావడంతో ఎల్లోమీడియా విషపురాతలు
- రైతులపై రౌడీషీట్ తెరుస్తామని బెదిరింపులు
- సీఎం చంద్రబాబుకు తొలి నుంచి వ్యవసాయం, రైతులంటే చిన్నచూపే


రైతులతో మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళ్యంలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను నేరుగా తెలుసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్ పర్యటనకు జనం వెళ్లకుండా ఆంక్షలు పెట్టినా భారీ జనసందోహం వచ్చారు. ఇది ఓర్వలేని ప్రభుత్వం, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయి. రైతులకు కష్టాలు తెలుసుకోవడానికి వస్తే కూడా రాజకీయ కుట్రలు పన్నడం ఏంటని..అయినా చంద్రబాబు కూడా రైతు కుటుంబం నుంచే వచ్చినా కూడా ఆయనకు వ్యవసాయం అంటే చిన్నచూపు కావడం వల్లే ఇలా అన్నదాతలకు అన్యాయం చేయడాన్ని వైఎస్సార్‌సీపీ రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు ఖండిస్తున్నారు.

రైతులపై రౌడీషీట్‌లా..



జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు వెళ్లిన రైతులపై రౌడీషీట్ పెడతామని పోలీసులు బెదిరించారు. రైతుల బాధలను గుర్తించి, వారికి గిట్టుబాటు ధర ఇవ్వాలని ఆయన పర్యటిస్తే తప్పేముంది? ప్రభుత్వం ఎలాగో మంచి ధర ఇవ్వడం లేదు. ఆ బాధను జగనన్నకు చెప్పుకోవాలని రైతులు చూస్తే అధికారాన్ని అడ్డం పెట్టుకుని పోలీసులతో బెదిరించారు. ఎన్ని చేసినా వారి ప్రయత్నాలు ఫలించలేదు.

- కృష్ణారెడ్డి, రైతు విభాగం, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు

బషీర్‌బాగ్‌ను గుర్తు తెస్తున్నారు



1996లో బషీర్‌బాగ్‌లో రైతులు ధర్నా చేస్తుంటే బాబు పోలీసులతో కాల్పులు జరిపించారు. ప్రస్తుతం ఆ పాలనను గుర్తుకు తెస్తున్నారు. రైతులంటే అంత చులకన భావం ఎందుకో అర్థం కాదు. గిట్టుబాటు ధర ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జగనన్న వస్తే తట్టుకోలేకపోయారు. ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. అయినా పర్యటన సక్సెస్ అయింది.

- ప్రకాష్, వైఎస్సార్‌సీపీ గుడిపాల మండల అధ్యక్షుడు

ఆయనదీ రైతు కుటుంబమే కదా..



చంద్రబాబు తండ్రి ఖర్జూరనాయుడు వ్యవసాయం చేసి జీవించారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన బాబుకు వారంటే ఎందుకు నచ్చదు. ఉచిత కరెంటు, సబ్సిడీ విత్తనాలు, పంట సాయం, గిట్టుబాటు ధర ఎందుకు.. అసలు వ్యవసాయం దండగ అంటారు. గత పాలనలో మే నెలలో సబ్సిడీ వేరుశనగను ఆర్బీకేల ద్వారా ఇచ్చారు. ప్రస్తుతం వాటిని సక్రమంగా ఇవ్వడం లేదు.

- బాబునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు, చిత్తూరు మండలం

మామిడి రైతులకు నరకం



గత వైఎస్సార్‌సీపీ పాలనలో మామిడికి కిలో రూ.25 వరకు ఇచ్చి కొనుగోలు చేశారు. ప్రస్తుతం కర్ణాటకలో కిలో రూ.16 ఇచ్చి కొంటున్నారు. కానీ ఇక్కడ ఎందుకు రూ.8 కూడా ఇవ్వడం లేదు. మామిడి రైతులు నరకం చూస్తున్నారు. బాధతో మామిడి చెట్లను తొలగించి ప్రత్యామ్నాయంగా మరో పంటను వేస్తున్నారు.

- మధుసూదన్, సర్పంచ్, కుప్పిగానిపల్లె పంచాయతీ, గుడిపాల మండలం

విజనరీ ఎక్కడ ?



దేశంలోనే ముందుచూపు ఉన్న సీఎంగా బాబు గొప్పలు చెప్పుకుంటారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడంలో అది ఎక్కడికి పోయింది. ఆలస్యంగా పల్ప్ ఫ్యాక్టరీలు ఎందుకు తెరిచారు ? ప్రభుత్వం సబ్సిడీతో కలిపి మామిడి కిలో రూ.12 అని ప్రకటించినా ఎందుకు అమలు కాలేదు. ప్రస్తుతం సబ్సిడీతో పాటు రూ.8 వస్తే చాలని రైతులు ఫ్యాక్టరీల వెంట రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు.

- వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఫెడరల్ ఫార్మర్ అసోసియేషన్

కలిగిరి వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

- నేడు అంకురార్పణ

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : చిత్తూరు జిల్లా కలిగిరికొండ కలిగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు మండలాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం అంకురార్పణతో ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. గురువారం టీటీడీ అధికారులు పత్రికా ప్రకటన విడుదల చేసింది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వివిధ రకాల పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు గరుడ సేవ నిర్వహించనున్నారు.

మునీంద్ర ఆరోపణలు అవాస్తవం

కాణిపాకం: తప్పుడు డాక్యుమెంట్లతో భూమిని రిజిస్ట్రేషన్ చేశానంటూ తనపై మునీంద్ర నాయుడు చేసిన ఆరోపణలు అవాస్తవమని గుడిపాల మండలం బుచ్చన్న కండ్రిగ గ్రామానికి చెందిన నాయుడు తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట ప్రకారం తన తండ్రి సోదరులకు నగదు చెల్లించి వారి వాటా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇంటి స్థలాన్ని ఆక్రమించడంతో పాటు దారి సౌకర్యం లేకుండా చేశానని మునీంద్ర నాయుడు చేసిన ఆరోపణలు నిరాధారం అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని, దీని జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేశారని మొగిలి నాయుడు కుటుంబ సభ్యులు బాబు నాయుడు, సంపూర్ణ, రాజమ్మ, పావని తెలిపారు.

క్లుప్తంగా

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా విడుదల

యాదమరి: మండలంలోని అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హత పొందిన రైతుల జాబితా విడుదల అయినట్లు మండల వ్యవసాయ అధికారి దీప తెలిపారు. గురువారం ఆమె మండలకేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద అర్హత పొందిన వారి జాబితాను ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. ఈ జాబితాలో రైతులు తమ పేరు లేకపోతే ఈనెల 13వ తేదీ లోపు స్థానిక రైతు సేవా కేంద్రాల సహాయకుడి వద్ద ఫిర్యాదు చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

వైద్యసేవలు అందిస్తున్నాం


వైద్యం చేస్తున్న వైద్యసిబ్బంది

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ రష్మిత అన్నారు. గురువారం మరకాలకుప్పం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందించడం జరుగుతోందన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్‌లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులు వైద్యసేవలు పొందారు.

గర్భిణులకు వైద్యసేవలు

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లెలో గురువారం ఉచిత వైద్య సేవలందించారు. మండల వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి, ఆరోగ్య సూచనలు, సలహాలిచ్చారు. అదేవిధంగా కృష్ణాపురంలో వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు సూచనలు, సలహాలిచ్చి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ బేబీశ్వర్‌రెడ్డి

ఐరాల: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు ఆకాంక్షించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ బేబీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని, తద్వారా మంచి ఫలితాలు సాధిస్తారని తెలియజేశారు. అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేష్‌రెడ్డి, శివయ్య, హరినాథ్‌గుప్త, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉన్నతాశయాలతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నిత్యబాబు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు చిన్నతనం నుంచి ఉన్నతాశయంతో ముందుకు సాగాలని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు అన్నారు. నగరంలోని సంతపేటలో ఉన్న బృందావన్ సీబీఎస్ఈ పాఠశాలలో మెగా పీటీఎం సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రణాళిక ప్రకారం విద్యనభ్యసించాలన్నారు. కరస్పాండెంట్ శైలజా కుమారి మాట్లాడుతూ దేశభవిష్యత్ తరగతి గదిలోనే ఇమిడి ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయం నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యలో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రియతేజ, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

దక్షిణామూర్తి సేవలో ప్రముఖులు


దక్షిణామూర్తిని దర్శించుకుంటున్న బీజేపీ నాయకులు

తవణంపల్లె: మండలంలోని శివగిరి ఆశ్రమంలో దక్షిణామూర్తిని గురువారం గురు పౌర్ణమి సందర్భంగా బీజేపీ నాయకులు దర్శించుకున్నారు. శివగిరిలో ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అప్రమేయానందగిరి స్వామి ఆధ్వర్యంలో దక్షిణామూర్తికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కేవీ చంద్రమోహన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి


రంగోలి పోటీలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి బాలాజీ, ఎంఈఓ హేమలత

తవణంపల్లె: ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, డీఎస్‌డీఓ బాలాజీ తెలిపారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తవణంపల్లె హైస్కూల్లో, తవణంపల్లె మోడల్ స్కూల్లో నిర్వహించిన ఈ ఆత్మీయ సమాశానికి ఆయనతో పాటు ఎంఈఓ హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బిడ్డల చదువుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో తల్లులకు, విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, హెచ్ఎంలు, సీఆర్పీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతోనే మంచి భవిష్యత్


గుడిపాల: బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే


బంగారుపాళెంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

గుడిపాల: విద్యార్థులకు చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. గుడిపాలలోని బొమ్మసముద్రం ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించడం జరిగిందన్నారు. ఇంటర్ విద్యలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన సొంత నిధులతో క్రీడా పరికరాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శిరీష,ఎంఈఓ హసన్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

బంగారుపాళెం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. గురువారం మండలంలోని కీరమంద, బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్‌టీచర్స్‌మీటింగ్ కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ మహేష్, ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, హెచ్ఎం రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కమణీయం.. సీతారాముల కల్యాణం


కల్యాణం తిలకించదానికి విచ్చేసిన భక్తులు


స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉభయదారులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరామస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు సీతారాములకు పట్టు వస్త్రాలు, సుగంధపరిమళ పుష్పాలు, మంగళసూత్రం, పూజా సామగ్రి, పండ్లు ఫలహారాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఆలయ మండపంలో వేదపండితులు సీతారాముల కల్యాణానికి వధూవరులను సుందరంగా తీర్చిదిద్దారు. వేదమంత్రాలు పఠనం చేస్తూ కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాములోరి కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై కోదండరాముడు

కోదండ రామాలయంలో గురువారం రాత్రి గరుడ వాహన సేవ వైభవంగా జరిగింది. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, సుగంధ పరిమళ పుష్పాలు, గజమాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు స్వామిక అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. గరుడుడిపై కొలువుదీరిన కోదండరామస్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఆలయంలో స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో గజ వాహన సేవను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వర రెడ్డి తెలిపారు.


గరుడ వాహనంపై దర్శనమిస్తున్న కోదండరాముడు

మార్కెట్‌లో మామిడి కొనుగోళ్లు

బంగారుపాళెం: స్థానిక మామిడి మార్కెట్ యార్డులో మామిడి కాయల కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక సందర్భంగా రైతులు మామిడికాయలు మార్కెట్‌కు తీసుకురాకుండా అడ్డుకున్నారు. బుధవారం బంగారుపాళెం మామిడి మార్కెట్ యార్డును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించి, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర గురించి రైతులను కలసి తెలుసుకుని వారికి భరోసా కల్పించి వెళ్లారు. ఈ నేపథ్యంలో మామిడి తోటల్లో కోతలు ఆగిపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. బుధవారం సాయంత్రం నుంచి మామిడి మార్కెట్‌లో కొనుగోళ్లు యథావిధిగా సాగాయి. సుమారు 500 టన్నుల మామిడి కాయలు కొనుగోలు చేశారు. మండలంలోని 13 ర్యాంపుల ద్వారా మామిడి అమ్మకాలు చేపట్టారు.


బంగారుపాళెం మార్కెట్‌లో మామిడి కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారులు

వ్యాస మహర్షికి పూజలు

కాణిపాకం: గురుపౌర్ణమి సందర్భంగా కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని కల్యాణ వేదికపై గురువారం వ్యాసమహర్షికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వ్యాస మహర్షిపై ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, ధనంజయ, ధనపాల్, అర్చకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరి క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలు


అర్ధగిరి క్షేత్రంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు


బంగారుపాళెం: సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం, ప్రాకారోత్సవం
- భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి అభిషేకం చేయించారు. స్వామిని గంధం, తమలపాకులు, తులసిమాలలతో ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు. ఆలయ ఈఓ హనుమంతురావు భక్తులకు ఉచిత ప్రసాదాలను అందజేశారు.

భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం

గురు పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని వేదపండితులచే ఆలయ ఆవరణలో ఉభయదారులచే అర్చకులు భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ హోమం నిర్వహించి పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా ప్రాకారోత్సవం

ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆలయ ఈఓ హనుమంతురావు పర్యవేక్షణలో అర్చకులు ఉత్సవమూర్తికి అభిషేక పూజలు చేపట్టారు. పల్లకిని సుగంధ పరిమళ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పల్లకిలో కొలువుదీరిన స్వామి ఆలయం, సంజీవరాయ పుష్కరిణి చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని పాలేరు జగనన్న కాలనీలో గల షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం భక్తిశ్రద్ధలతో భక్తులు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. అనంతరం శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజను మొగిలివెంకటగిరికి చెందిన పురోహితులు పూర్తి చేశారు. మధ్యాహ్నం ఆలయ ధర్మకర్తలు రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో మండల కరుణీగర్ సంఘం ఆధ్వర్యంలో గురుపౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు.


భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఆలయ ఈఓ హనుమంతురావు

భక్తిప్రపత్తులతో చండీహోమం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో గురువారం చండీ హోమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. అర్చన కార్యక్రమాలు పూర్తయిన తర్వాత చండీహోమం ప్రారంభించారు. హోమమంత్రాలు పఠించి పండితులు హోమాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈవో తిమ్మారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.